ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ● పోతుగల్ పీహెచ్‌సీ తనిఖీ

పోతుగల్ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్, ఆగస్టు 21 : ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దవాఖాన సిబ్బందిని ఆదేశించారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సినేషన్ రూం, ఓపీ గది, రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఆయాలు లేక ఇబ్బందులు ఉన్నాయని, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని, ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరిందని, విద్యుత్, నీటి వసతికి ఇబ్బదులు ఉన్నాయని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ పోత్గల్ ప్రాథమిక కేంద్రం వైద్యురాలు గీతాంజలి, వైద్య సిబ్బంది ఉన్నారు. అలాగే, గూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఎలుకలు కొరుకుతున్నయ్..

- ఇద్దరి విద్యార్థినులపై దాడి ● దవాఖానకు తరలింపు
- దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఘటన

చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎలుకల దాడిలో ఇద్దరు విద్యార్థినులు గాయపడిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. ఈ విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులు నిత్యం ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల భవనం పై అంతస్తులో విద్యార్థినులు ఉంటుండగా, కింద నీటితోపాటు చెత్తాచెదారంతో ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరు తొమ్మిది తరగతి విద్యార్థినులు ఎం ఇందుశ్రీ, బీ నందినిపై ఎలుకలు దాడి చేసి గాయపర్చాయి. బుధవారం ఇద్దరు విద్యార్థినులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. దీంతో విద్యార్థునుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-AII

CHANGE OF NAME

★I, T. AJAY S/o. RAMSINGH R/o. 3-1-36, Auto Nagar, Sircilla TG. Changed My Name As TAKUR AJAY SINGH S/o. TAKUR RAM SINGH As Per Aadhar & PAN Card.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వర్గీకరణ వ్యతిరేక బంద్ ప్రశాంతం

గంభీరావుపేట: మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రం

సిరిసిల్ల రూరల్ : తంగళ్లపల్లిలో రహదారిపై బైఠాయించిన నేతలు

సిరిసిల్ల టౌన్ : జిల్లా కేంద్రంలో మూసివేసిన దుకాణాలు

సిరిసిల్ల టౌన్/ వేములవాడ/ ఇల్లంతకుంట/ సిరిసిల్ల రూరల్/ గంభీరావుపేట/ముస్తాబాద్/ చందుర్తి/ఎల్లారెడ్డిపేట /కోనరావుపేట, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరిగింది. ఆయా గ్రామాల్లోని షాపులు, పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు. సిరిసిల్ల పట్టణంలోని దుకాణాలు మూసివేయిస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన నాయకులు అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందజేశారు. వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ కళాశాల వద్ద మాల మహానాడు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వేములవాడ పట్టణంలో మాల మహానాడు నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మురుగు కాల్వల శుద్ధి

- నమస్తే కథనానికి స్పందన

నారాయణపూర్‌లో మురుగు కాల్వలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: నారాయణపూర్‌లో కొంత కాలంగా పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారడం, మండలంలో పందులు కుక్కల స్వైర విహారంపై 'గాడి తప్పిన పాలన' పేరిట నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మురుగు కాల్వలు శుభ్రం చేశారు. బుధవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ, ప్రజలు చెత్తను పడేసేటప్పుడు మురుగు కాల్వలో పడేయకుండా ఇంటింటికీ ఇచ్చిన చెత్త బుట్టలో వేసి చెత్త సేకరణ ట్రాక్టర్‌కు అందించాలని కోరారు. అలాగే పందుల పెంపకం దారులు కాలనీల్లో వదలవద్దని వాటిని ప్రత్యేక ఆవాసాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ధర్నాను సక్సెస్ చేయాలి

కోనరావుపేట, ఆగస్టు 21: రైతుల రుణమాఫీ అంక్షలు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక వద్ద బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు మండ ల యువజన విభాగం అధ్యక్షుడు ముష్నం జీవనగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రైతులు, నేతలు, కార్యకర్తలు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు.

ఇల్లంతకుంట, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్ర భుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేయక పో వడంపై గురువారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహ రెడ్డి బుధవారం పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి రైతులకు అండగా నిలువాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి, ఆగస్టు 21: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మల్లారపు దేవయ్య అధ్యక్షతన జరిగింది. కార్మికులకు సంబంధించిన వెల్ఫేర్ బోర్డులో జమైన డబ్బులను ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. ఇక్కడ ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుంటుకు నరేందర్, నాయకులు బుస రాజం, గంగిపల్లి అంజయ్య రాజు, వెంకటేశ్, నర్సయ్య, జాఫర్, చందు రాజయ్య తదితరులున్నారు.

వర్షపు నీరు తొలగింపు

- నమస్తే కథనానికి స్పందన

వేములవాడ రూరల్, ఆగస్టు 21: వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో మూడు రోజుల క్రితం వర్షం నీటికి అశోక్ ఇంట్లోకి వరదనీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని నమస్తే తెలంగాణలో వార్త ప్రచురితం కాగా జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. అశోక్ ఇల్లు రోడ్డు కింద ఉండటంతో వర్షం నీరు చేరిందని, వరదను గ్రామ పంచాయతీ సిబ్బంతితో పూర్తిగా తొలగించామని కార్యదర్శి తెలిపారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

తెలంగాణ చౌక్, ఆగస్టు 21: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, గోపాల్‌నగర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి, మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లి బోధనను పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ఇక్కడ హెచ్‌ఎం భాగ్య రేఖ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ఆయుష్ వైద్య శిబిరం

కోనరావుపేట, ఆగస్టు 21: మండలంలోని కొలనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయుష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యురాలు కల్యాణి వైద్య పరీక్షలను నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇక్కడ జిల్లా ప్రోగ్రాం మేనజర్ తిరుపతి, ఎన్ఎం సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణ మాఫీపై స్పష్టతనివ్వాలి

కలెక్టరేట్, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీపై స్పష్టతనివ్వాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ ఎలాంటి ఆటంకాలు లేకుండా రూ.2 లక్షలను అమలు చేయాలన్నారు. ఇక్కడ కుస్మ గణేశ్, పోశెట్టి, సత్యనారాయణ, చిప్ప దేవదాస్‌లున్నారు.

ఓటరు జాబితా తయారు చేయాలి

వీర్నపల్లి, ఆగస్టు 21 : రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఎటువంటి తప్పులు లేకుండా వార్డుల వారీగా, పంచాయతీ ఓటర్ల జాబితాను తయారు చేయాలని డీఎల్పీవో జోగం రాజు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతర ప్రక్రియగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి, శానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు యథావిధిగా జరిగే విధంగా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో పన్నులు వందశాతం వసూలు చేయాలని వారిని ఆదేశించారు. ఇక్కడ ఎంపీడీవో రఘురాం, కార్యదర్శులున్నారు.

'కొండాపూర్ పంచాయతీలో అవినీతి'

కోనరావుపేట, ఆగస్టు 21: మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. గతంలో గ్రామ పంచాయతీలో రికార్డును తనిఖీ చేసి సుమారు రూ.36 లక్షల వరకు అవినీతి జరిగిందని సంస్థ గుర్తించినట్లు తెలిపారు. అందుకు సంబంధించి వివరాలను కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సంస్థ అందించిన వివరాలను పరిశీలించి ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్పీకి వివరాలను అందించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి నేవూరి రత్నాకర్, జిల్లా ఐడీ కార్డు ఇన్‌చార్జి సలీం, చౌటుపల్లి వెంకటేశ్ తదితరులున్నారు.

'ఏబీవీపీ ఆరోపణలు సరికాదు'

కలెక్టరేట్, ఆగస్టు 21 : తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలపై ఏబీవీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను పేరెంట్స్ కమిటీ సభ్యులు ఖండించారు. బద్దెనపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించడం సరికాదని, బద్దెనపల్లి గురుకుల హాస్టల్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందిన గురుకుల పాఠశాలను కావాలనే ఏబీవీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని పద్ధతి మార్చుకోకుంటే పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతామని అన్నారు. మరోసారి పాఠశాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేస్తే ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ఏబీవీపీ నాయకులను హెచ్చరించారు. కార్యక్రమంలో సు మారు వందమంది పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బద్దెనపల్లి గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- ఏబీవీపీ నాయకులు ● పాఠశాల ఎదుట ధర్నా

బద్దెనపల్లి లో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 21: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలంటూ ఏబీవీపీ నాయకులు పాఠశాల ఎదుట బుధవారం ధర్నా చేశారు. రాఖీ పండుగ రోజున హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినులను అన్నాదమ్ములకు రాఖీ కట్టడానికి అనుమతివ్వలేదని, మెయిన్‌గేట్ తాళం వేసి ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. కిటికీల్లోంచి రాఖీలు కట్టుకున్నారన్నారు. పండుగ పూట విద్యార్థినులను మానసిక క్షోభకు గురిచేశారని పేర్కొన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి సస్పెండ్ చేయాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు చేరుకుని, ఏబీవీపీ నాయకులను ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు, సామనపల్లి ప్రశాంత్, రాజు,శ్రీనివాస్, ధనుష్, పవన్, విష్ణు, రవీందర్, శివ సాయి తదితరులున్నారు.

ఎగువ మానేరుకు వరద నీరు

జలకళను సంతరించుకుంటున్న ఎగువ మానేరు ప్రాజెక్టు

గంభీరావుపేట, ఆగస్టు 21: మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగు ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్టుకు 570 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని డీఈ నర్సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 31 అడుగులకు ప్రస్తుతం 19 అడుగులకు చేరుకున్నది.

ఎస్సారార్‌లో 16.47 టీఎంసీలు

బోయినపల్లి, ఆగస్టు 21: బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో 16.47 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్ హౌస్ నుంచి వరద కాలువ ద్వారా 7,110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 3,410 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం సామర్థ్యం 27.54 గాను 16.47 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న కాళేశ్వరం జలాల ఎత్తిపోత

ఇల్లంతకుంట, ఆగస్టు 21 : మండలంలోని అనంతగిరి గ్రామ శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు కాళేశ్వరం జలాలు బుధవారం బాహుబలి మోటర్ల ద్వారా రోజుకు 6,440 క్యూసెక్కుల నీటి ఎత్తిపోత కొనసాగుతున్నదని ఏఈ సమరసేన తెలిపారు. ఎస్సారార్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్ గోదావరి జలాలు రాగా బాహుబలి మోటర్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టులో 1.25 టీఎంసీ నీరు నిలువ ఉండగా సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశారు.

రాజన్న ఆలయంలో రద్దీ

బలగం డైరెక్టర్ వేణుకు శేషవస్త్రం కప్పి ఆశీర్వదిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

వేములవాడ టౌన్, ఆగస్టు 21 : శ్రావణమాసం సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయం బుధవారం భక్తులతో రద్దీగా కనిపించింది. భక్తులు క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్నను దాదాపు 10వేలకుపైగా భక్తులు దర్శించుకున్నారని, స్వామివారికి రూ.13 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, రాజన్నను బలగం మూవీ డైరెక్టర్ వేణు కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు వే దమంత్రాలతో ఆశీర్వచనం చేయగా, ప్రధానార్చకులు చంద్రగిరి శరత్ వారికి స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదాన్ని అందజేశారు. వారివెంట ఆలయ పర్యవేక్ష కుడు తిరుపతి రావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

శ్రావణ మాస సందడి

రుద్రంగి, ఆగస్టు 21: శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రహ్లాద గుట్టపై వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. పూజారులు స్వామి వారికి ఉదయం వేద మంత్రాలతో, పం చామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా భక్తులు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. లక్ష్మీనరసింహ స్వామి వారిని జడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

బోయినపల్లి, ఆగస్టు 21 : విలాసాగర్ గ్రామానికి చెందిన సిలివేరి రాజు (49) అదే గ్రామానికి చెందిన పోలాడి రాజగోపాల్ (43)కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేయగా బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన రాజగోపాల్ తప్పించుకు తిరుగుతుండగా బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కోరెంలో సబ్‌సెంటర్ నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, ఆగస్టు 21: ప్రజారోగ్యంపై ప్ర భుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడి పల్లి సత్యం అన్నారు. బుధవారం కోరెంలో సబ్‌సెంటర్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్సీచెన్నాడి సుధాకర్‌రావుతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కోరెం సబ్‌సెంటర్ నిర్మాణానికి నేషనల్ హెల్త్ మిషన్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలు మంజూరు కాగా పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించి మాట్లాడారు. సబ్ సెంటర్ నిర్మాణం పూర్తయితే మరింత మెరుగైన వైద్య సేవలందుతాయని తెలిపారు. పంచాయతీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రాసనకు హాజరై చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సు ధాకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ లక్ష్మణ్‌రావు, ఏఈ విష్ణువర్ధన్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వసంతరావు, సెస్ డైరెక్టర్ సుధాకర్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జయశీల, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీపతి గౌడ్, కాంగ్రెస్ నాయకుడు రమణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు తీపి రెడ్డి కిషన్‌రెడ్డి, దుర్గారెడ్డి, నాయకులు రవి, మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

చెట్లు కొట్టిన ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: పోతిరెడ్డిపల్లి శివారులో కడపరాయి గుట్ట అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికిన వ్యక్తిని డీఎఫ్‌వో బాలమణి, ఎఫ్ఆర్‌వో కల్పన బుధవారం పట్టుకున్నారు. రెండు రోజుల క్రితం 'యథేచ్ఛగా చెట్ల నరికివేత' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ క్రమంలో అటవీ అధికారులు చెట్లను నరికిన వ్యక్తి ఆచూకీ కోసం వివరాలు సేకరించి, పట్టుకున్నట్లు తెలిపారు. చెట్లను నరికివేసిన వ్యక్తి పోతిరెడ్డిపల్లి వాసిగా గుర్తించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల టౌన్ : లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దార్ల సందీప్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21: జిల్లా కేంద్రంలోని 34వ వార్డులో మంగళవారం ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకుడు దార్ల సందీప్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వార్డుకు చెందిన ఓరగంటి రాజమణికి రూ.16,500, ఒర్సు రోహిత్ చందర్‌కు రూ.19,500 చెక్కులను అందజేశారు. ఇక్కడ స్థానిక కౌన్సిలర్ దార్ల కీర్తన్, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: బొప్పాపూర్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు రూ.78 వేలు మంజూరు కాగా సదరు చెక్కులను అందించారు. ఇక్కడ పీఏసీఎస్ డైరెక్టర్ ల్యాగల సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇల్లెందుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మనవేణి సత్యం, మొడుసు దేవరెడ్డి, అశ్వాక్ ఉన్నారు.

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 21: సిరిసిల్ల మున్సిపల్ 11 వవార్డు పరిధిలోని రాజీవ్‌నగర్‌లో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కౌన్సిలర్ ఒగ్గు ఉమ రాజేశం అందజేశారు. వార్డుకు చెందిన చిలగాని జనార్దన్‌కు రూ.6500, చిలగాని లహరికి రూ.9వేలు మంజూరు కాగా వారి నివాసాలకు వెళ్లి చెక్కులను అందజేశారు. మాజీ మంత్రి కేటీఆర్ చొరవతోనే సహాయ నిధి కింద ఆర్థిక సహాయం మంజూరైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు పచ్చునూరి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు తీగల ప్రవీణ్, బీఆర్ఎస్ నేతలు సట్కూరి చిట్టిబాబు, శ్రీకాంత్, సుధాకర్ తదితరులున్నారు.

పుస్తె మట్టెల అందజేత

ముస్తాబాద్, ఆగస్టు 21 : మండలంలోని చీకోడు గ్రామ పేద పిట్ల చంద్రం కూతురు వివాహానికి గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవీవెంకటేశ్వర్‌రావు దంపతులు పుస్తె మట్టెలు, బియ్యం వితరణ చేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాద నరేశ్ ఆధ్వర్యంలో శ్రేణులతో కలిసి కుటుంబ సభ్యులకు వాటిని అందజేశారు. ఇక్కడ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాద నరేశ్, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి గున్నాల రమేశ్ గౌడ్, చీకోడ్ బూత్ అధ్యక్షుడు ఎల్లం, సర్పంచ్ చిట్నేని శ్రీనివాసరావు, సురేశ్, ప్రభాకర్, చంద్రం, మల్లయ్య, నాయకులున్నారు.

సర్టిఫికెట్ కోసం బైఠాయింపు

బోయినపల్లి, ఆగస్టు 21: బోయినపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నీలోజిపల్లికి చెందిన కొండం శ్రీనివాసరెడ్డి తన భార్య శైలజకు సర్టిఫికెట్ ఆఫ్ రెసిడెన్సీ అనే సర్టిఫికెట్‌ను జారీ చేయాలని ప్లకార్డు పట్టుకుని బైఠాయించాడు. తన భార్య శైలజ టీజీపీఎస్సీలో ఉద్యోగానికి ఎంపికైనట్లు అందుకు 1 నుంచి 3వ తరగతి వరకు విలాసాగర్‌లో చదవుకోగా ప్రస్తుతం ఆ పాఠశాల మూత పడగా తహసీల్దార్ జారీ చేసే సర్టిఫికెట్ ఆఫ్ రెసిడెన్సీ సర్టిఫికెట్ జారీ చేయాలని దరఖాస్తు చేసుకోగా ఇవ్వడంలేదని మరో రెండు రోజుల్లో గడువు ముగుస్తుందని బైఠాయించాడు. అనంతరం పోలీసులు వచ్చి ఆయనను లేపి పక్కకు పంపించారు. ఈ విషయమై తహసీల్దార్ పుష్పలతను వివరణ కోరగా ఆ సర్టిఫికెట్ ఇచ్చే అధికారం తహసీల్దార్‌కు లేదన్నారు. వాస్తవంగా అక్కడ ఏది ఉంటే అది ఇస్తామని, అది కూడా విచారణ జరిపి ఇస్తామన్నారు. సర్టిఫికెట్ జారీ చేసి సెక్షన్‌కు పంపినట్లు ఆమె తెలిపారు.

24న కొదురుపాకలో ఉచిత కంటి ఆపరేషన్లు

బోయినపల్లి, ఆగస్టు 24: బోయినపల్లి మండలం కొదురుపాక బీసీఎం కంటి దవాఖానలో ఈ నెల 24 ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆ దవాఖాన వ్యవస్థాపకుడు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వైరాగ్యం రాజలింగం-రీట బహదూర్‌షా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంటి ఆపరేషన్ చేయించుకునే వారు ముందుగా బీసీఎం కంటి దవాఖానకు వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే 31 మంది కంటి ఆపరేషన్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరైనా కంటి సమస్యలున్నవారు ముందుగా దవాఖానకు వచ్చి పరీక్షలు చేసుకుని సిద్ధంగా ఉంటే కంటి ఆపరేషన్ చేస్తామని తెలిపారు.

సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన

వేములవాడ రూరల్, ఆగస్టు 21: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, సెస్ ఏడీఈ, శ్రీధర్‌తోపాటు సెస్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రుద్రవరంలో కొత్తగా సబ్‌స్టేషన్ మంజూరు కాగా స్థల పరిశీలిన చేశారు. గతంలో కూడ స్థలాన్ని పరిశీలించగా ఎన్‌పీడీసీఎల్ అధికారులు మరోసారి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పిల్లి కనుకయ్య, మాజీ ప్రజాప్రతినిధులు గాలిపెల్లి స్వామి, భూమయ్య, మల్లయ్య, కనుకయ్యతోపాటు తదితరులున్నారు.

ముండ్ల పొదల తొలగింపు

ఇల్లంతకుంట, ఆగస్టు 21 : మండలంలోని వెల్జిపూర్ నుంచి సిరిసిల్ల వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముండ్ల పొదలను ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ బుధవారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తీసివేయించారు. మండలం నుంచి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల పైకి ప్రమాదకరంగా వచ్చిన ముళ్ల పొదలను తొలగింపజేసిన ఎస్ఐకి కృతజ్ఞతలు ప్రయాణికులు తెలిపారు.

గైనకాలజిస్ట్‌ను నియమించాలి

వేములవాడ, ఆగస్టు 21: వేములవాడ ఏరియా దవాఖానలో వైద్యుల బదిలీల తర్వాత రెగ్యులర్ గైనకాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని రెగ్యులర్ గైనకాలజిస్ట్‌ను నియమించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు కోరారు. బుధవారం వేములవాడ ఏరియా దవాఖానకు సందర్శించి మాట్లాడారు. వేములవాడ ఏరియా హాస్పిటల్‌లో ప్రభుత్వం పూర్తిస్థాయి గైనకాలజిస్టును నియమించాలని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీజేపీ పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, నాయకులు పిన్నింటి హన్మాండ్లు, వివేక్ రెడ్డి, నేరెళ్ల సాయి, మైలారం శ్రీనివాస్, నాగుల మొక్షిత్, మేరుగు లక్ష్మణ్, నామాల శేఖర్, బిళ్ల కృష్ణ, సగ్గు రాహుల్, రేగుల శ్రీకాంత్, కొరెపు వెంకటేశ్, నేరెళ్ల కిరణ్, పండుగ హరీశ్, ఖమ్మం పృథ్వీరాజ్, నర్సయ్య తదితరులున్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

వేములవాడ రూరల్, ఆగస్టు 21: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వృద్ధురాలు మృతి చెందింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తిప్పాపూర్ సమీపంలో భిక్షాటన చేసే ఓ వృద్ధురాలిని రాత్రి ఒక వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా వృద్ధురాలికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.